# మామగారి మర్యాద

"ఇదేమిటి? ఇల్లా నా వెంట బడ్డాడు? ఇన్నేళ్ళొచ్చాయి. సిగ్గయినాలేదు."

"వెధవ!"

"వెధవ అని ఇక్కడ నాముందు అని ఏం లాభం? వెళ్ళి ఆయన ముందు అనండి ఆమాట"

"అంటా, అంటా, అంతేనా? ఇంకా అంటా. కానీ, ఇంకా ముదరనీ"

పంకజాక్షి కళ్ళవెంబడి నీళ్ళు పెట్టుకుంది. "ఇట్లా పదిరోజుల్నించి అంటున్నారు. నాకు తెలుసు మీ కష్టం. పోనీ నన్ను మా యింటికన్నా పంపండి. ఆ పోరేనయం దీనికన్నా."

సిగరెట్ పొట్టిముక్కవంక దిగులుగాచూసి, మంచంకింద పారేసి భార్య దగ్గిరగా జరిగి, మూసిన కుచ్చెళ్ళతో ఆమెకన్నీళ్ళు దిగులుతో తుడిచాడు. ఆ పంచ దుమ్ముమవల్లనో, దుఃఖంవల్లనో పంకజాక్షి కన్నీళ్ళెక్కువయినాయి.

"ఇల్లాంటి పశువుని నేనెక్కడా చూళ్ళేదు. మా చిన్నాన్న వొకడు వుండేవాడుగాని........"

అదేమిటి? మీ చిన్నాన్నయెవడు?"

"మా నాన్న తమ్ముడు"

"చాలా తెలివిగా మాట్లాడుతున్నావే. ఆ స్కూలు మాస్టరేనా ?"

"ఊఁ." అని,

కళ్ళు తుడుచుకుంటో లేచి, వెడుతోంది. నరసింహం ఆమె చేతిని పట్టుకొని లాగి కూలవేశాడు. కొంచెం సేపటి కిందట మృదువుగా తాకిన చేతిని ఆకస్మికమైన మోటతనానికి ఆశ్చర్యపడి చూసింది.

"వాడు ఏం చేశాడు ?"

"ఎవరు ?" అంది బేలమొహంతో.

"వాడే. ఆ బడిపంతులు. వెధవ."

"ఏం చేశాడు ? నేను చిన్నదాన్ని." అని దిండులో తల దాచుకుంది. ఆమె నడుముదగ్గిర్నించి చిన్న వెంట్రుకలు ఆడుకునే మెడదగ్గిరికి, వొకటే వొంపుగా తిరిగిన రేఖల అందాన్ని చూడకుండా మనసుని తొక్కిపట్టి,

"వూ" అని,

చెయ్యిపట్టుకుని లేవదీశాడు. ఇంకోసమయంలోనే ఐతే తనూ ఆమె వీపుమీదికి వొంగి చేతిని ముందుకు పోనిచ్చి కావిలించుకునేవాడు. ఆమె తలని ఆనుకుని చంపల్ని జిడ్డుచేసుకునేవాడు.

"ఏంలేదు. వయసులోవున్న ఆడపిల్లల్ని యేంచేస్తారు, అదే——"

"అంటే ?"

రక్తం, అణగక మసలుచున్న నీళ్ళవలె ఆరాట పడుతోంది.

"ఏముంది. ముద్దులు పెట్టుకొని నలపడం."

"ఎక్కడ ?"

"అంతానూ."

"అంటే"

"ఇంక నాకుతెలీదు. ఇప్పుడెందుకదంతా. దొంగలుపడ్డ ఆర్నెల్లకి-"

"దొంగలు పడ్డారా ?"

"సామెతకన్నాను. దొంగలేమిటి ?"

"దొంగలు గాక !"

"ఐతే మీరు కుక్కా ?"

"అంతకన్నా హీనంగా వుంది. నీకు పెళ్ళి అయిం తరవాతేనా ?"

"ఆ."

"వాడేవూళ్ళో వున్నాడిప్పుడు !"

"ఆయన సంగతెందుకు ? దగ్గర వున్నవాళ్ళ సంగతి చూడండి ముందు."

కాని నరసింహం మనసు ఆ చిన్నాన్నని వొదల్లే.

తన భార్యని ! పంకజాక్షి, ఆమెతండ్రి కూతురు ! పినతండ్రి అన్నకూతురు, యివన్నీకావడం మానేసింది. పెళ్ళితో తక్కిన బంధాలన్నీ, పన్నెండేళ్ళ అనురాగాలు మాసిపోయాయి. తనభార్య ! అన్నది మిగిలివుంది.

"వాణ్ణి తంతాను" అని గొప్పగా భార్యవంక చూశాడు. ఆమె నవ్వుతోంది.

"క్రైకలూరు పోవాలి. మీకు డబ్బులేవి ! అదిగాక మీరు వెళ్ళగానే.... యిక్కడ మీ నాయనగారు నన్ను—" అని

పకపక నవ్వింది. ఇదేమిటి. యేమీ ఫీలింగ్‌లేకుండా యిట్లా నవ్వుతుంది !

"డబ్బులేవీ" అన్నమాట అతని చెవులో నిలిచిపోయింది. అవును తనకి డబ్బులేవీ ? బి. ఎ. అయినాడు. ఇరవైరూపాయల వుద్యోగం ఇచ్చేవాడులేడు. ధనవంతుడయిన వర్తకుడి బిడ్డకనక బతుకుతెరువు సంగతి ఇన్నాళ్ళు ఆలోచనకే రాలేదు. చదువు, బల్లదగ్గిర వ్రాయడానికి

తప్ప పనికిరాదు. ఇంత వర్తకంగాని, చేతిపని చెయ్యాలనే అభిలాషనే, నేర్పరితనాన్నే, చంపేసింది ఆ చదువు. ఇప్పటికి ఎవరన్నా, అతని తలి దండ్రుల్ని,

"మీవా డేంచేస్తున్నాడు ?" అని అడిగితే.

"మావా డేంచెయ్యాలి ? వాడికి పనిచెయ్యవలసిన గతియేమి ?" అంటారు గర్వంగా. కానీ యీ మధ్య అప్పుడప్పుడు....

"మావాడా ! యేంచేస్తున్నాడు" అనడంకూడా విన్నాడు.

మొన్న వకసారి,

"పెళ్ళాంతో పడుకొంటున్నాడు" అని తల్లి అనడంకూడా విన్నాడు.

తనకు కావలసిన సౌకర్యాలన్నీ వున్నాయి. ఏమీ లోటులేదు. ఎంత ఖర్చుచేసిఐనా తనకు అవసరమైన వనుకున్నవి యిస్తారు. కాని అనవసర మైన వాటికియ్యరు. లెక్క చెప్పకుండా ఖర్చుచెయ్యడానికి కానీ లేదు. ఇంక స్వతంత్ర మేమున్నది ? స్వతంత్రం అంటే మంచిపనులకి మాత్రమే అంటారు. మంచి పనులు మాత్రమే చేస్తే స్వతంత్రం యెందుకు ? చెడ్డ పనులు చేసినా, చెయ్యకపోయినా, చెయ్యడానికి నిర్బంధం వుండకపోవ డమే స్వతంత్రం. నిజంగా చూస్తే ప్రపంచంలోనే స్వతంత్రం తక్కువ. మన పనులకీ, అభిప్రాయాలకీ కానీ స్వతంత్రం వుందనే మాయ కల్పిం చింది సృష్టి. ఆ అభిప్రాయం లేకపోతే జీవితం దుర్భరం. కనక యిది వరకే ఆలోచించుకున్నాడు. తాను ఉద్యోగం చెయ్యాలని. తన జీతం పై ఖర్చుకు సరిపోతుంది. పైగా ఇప్పుడిదో గోలవచ్చింది. తండ్రిని చూస్తే అతనికి ఎక్కువ గౌరవం లేకపోయినా, ఆయన్ని నీచంగా చూడవలసిన అవసరం రాలేదు. మొదటినించీ తండ్రి, తాను దైవాంశ సంభూతుడూ, లోకహితుడూ, భూలోకదైవమూ, ఐనట్టుగా పూజింపజేసుకున్నాడు కొడుకువాత తండ్రిని గౌరవించడంవల్ల తనకూ గౌరవం వస్తూండడం

చాత. తండ్రి సామాన్యమానవుడని తెలిసే వయసు వొచ్చింతరువాతకూడా ఆయన్ని గౌరవంతో మన్నించాడు.

మొన్న తాను సీతానగరం వెళ్ళినరోజు, కాళ్ళు పిసికించుకుని తన భార్యని, తానూ డాక్టరూ, తప్ప తాకకూడని స్థలాలలో తాకాడని తెలిసింతరవాత ఆ కా స్తగౌరవం పోయింది. మొదట అతను నమ్మలేదు. కాని, భార్య ఎందుకు అబద్దంచెప్పాలి. పొరబాటున చెయ్యి తగిలిందేమో. మళ్ళీ మూడురోజుల తరవాత భార్యస్నానం చేస్తూవుండగా తండ్రి తొంగిచూశాడని మళ్ళీ ఆమె గోలపెట్టింది. దానితో మనసులో అనుమానం స్థిరమయింది. కాని యింకా అనుమానపడదలచుకున్నాడు, అదే పరాయివాడై తే విరుచుకొని మీదపడును. తండ్రితో తగాదా అంటే చిన్నతనపు భయభక్తుల్నించి బై టపడడానికి మనసుకి కొంతకాలం పడుతుంది. ఏ కార్యం చెయ్యడం భయమో, ఆ కార్యం అనవసరమని మనసు చాలా కారణాలు చూపుతుంది. తగాదా ప్రారంభి స్తే ఎక్కడ అంతమౌతుందో! విడిపడాలసి వొస్తుంది. అప్పుడు భాగం పంచమనగూడదా? కాని, ఈ నౌకర్లు, చక్కని వంట, తల్లిప్రేమ, యివన్నీ, యీసదుపాయాలన్నీ కుదురుతాయా? ఇంక వ్యవహారమంతా తానే చూచుకోవాలి. కూరలుబజారునుంచి తెచ్చుకోవాలిరోజూ. అందువల్ల అనుమానాలెక్కువై నాయి. అంత పెద్దవాడు అట్లాంటిపని చేస్తాడా? చెయ్యడు. ఏదో పొరబాటు అని వూరుకున్నాడు. భార్యని ఆయన దార్నించి తప్పించుకు తిరగమన్నాడు. కొన్నాళ్ళు బాగానే వుంది. ఒకనాడు బంధువులు వ స్తే,

"మా కోడల్ని చూశారా? మాయింటికి లక్ష్మియిది. నా ప్రాణం మా అదృష్టంకొద్దీ లభించింది" అని దగ్గిరికి లాక్కొని వాళ్ళో కూచోపెట్టుకున్నాడు. యేం చేస్తుంది! వాళ్ళోంచి లేచే లోపున యేంజరిగిందో భర్తతో చెప్పుకోడానికి సిగ్గుపడ్డది.

దానితో నరసింహానికి రగులుకుంది. వూరికే మనసుకి ప్రాధాన్య మిస్తాంగానీ యీ ఆవేశాలు, కార్యాలు అన్నీ ఇన్‌స్టింక్ట్సువల్ల జరుగుతాయి. గౌరవం, యీ భార్య అవమానంతో ఎగిరిపోయింది. ధన సౌఖ్యాలు, భార్యమానంకన్న యెక్కువగా చూసుకొనేవారు లేకపోలేదు. కాని వారిని లోకం అమితమైన క్షుద్రులుగా పరిగణిస్తుంది. తండ్రితో తగాదాకి సమయం నిరీక్షిస్తున్నాడు గాని హామ్లెట్ మనసువలె ప్రతినిమిషం సంకోచాలు కల్పిస్తోంది అతని మనస్సు. చిన్నప్పటి అలవాట్లు తెంపుకోడం కష్టం. ఉగ్గుపాలతో సమస్త జనులు తనని పెంచిన తల్లి, ముత్తవలూ, ప్రపంచజనులు, పురాణాలు, వేదాలూ, కథలూ, గొప్ప విద్వాంసులైన గురువులూ, పితృభక్తిని బాగా మనసులో యెక్కించారు. తండ్రియెడల విధులూ, ధర్మాలూ, కృతజ్ఞతలూ, నూరిపోశారు. తిరగబడాలంటే యెన్నో బంధాలు తెంచుకోవాలి. ఎందుకు తండ్రికి విధేయుడుకావాలో, కృతజ్ఞత యెందుకు వుండాలో ప్రశ్నించనివాడు ఒకడూ లేడు.

తండ్రిద్రోహం చెయ్యగలడనేమాట ఏశాస్త్రమూ, యే పండితుడూ అంగీకరించడు. తండ్రి యేపని చేసినా తన పుత్రుడి మేలుకోరే. ఆస్తి అంతా తగలేసినా, చిరాకుపుట్టి కొడుకువీపుమీద చేతులదురద దీర్చుకున్నా, పెళ్ళిచేసినా, పెళ్ళాల్నిలాగినా, సమస్తస్వేచ్ఛను నిర్బంధించి, అప్రయోజకుడిగా తయారుచేసినా, తండ్రి యెప్పుడూ సకార్యమేగాని అపకారం చెయ్యడం అసంభవం.

అంతా యేమిటి ? అతని చేతిలో డబ్బువుంది. అదీ యీ ధర్మాలన్నిటికీ మూలసూత్రం. ఈ పిల్లవాడిమీద ప్రేమవల్ల కన్నాడా ? తన ఘనత కోసం బట్టలువేస్తాడు, కొడతాడు, చదువు చెప్పించుకుంటాడు, కట్నం కోసం. పెళ్ళాన్ని మెడకు కడతాడు. వీళ్లైతే ముసలితనంలో మీద పడు తుంటాడు. దీనికి కృతజ్ఞత ! పితృభక్తి !!.......

11)

మర్నాడు మధ్యాహ్నం అతన్ని తండ్రి చల్లపల్లి పొమ్మన్నాడు, బాకీ వొసూలు చెయ్యడానికని.

"సరే. యిద్దరం వెడతాము."

"ఎవరిద్దరూ ?"

"నేనూ. అదీ"

"అదీ ? బాకీ వొసూళ్ళకి అదెందు ? నీకు చాతగాదా ?"

"ఎందుకో మీకే తెలుసు. ఇంట్లో నిలవడానికి వీల్లేకుండాచేస్తే ఏం చెయ్యం ?"

"ఆహా ! మొదలుపెట్టిందీ పొరుపులు పెట్టడం. చూడ్డానికి ఎంత అమాయకురాలుగా వుంటుంటో ! ఇంత మురిసి సంబంధం చేసుకుంటే, చివరికిట్లా అయిందా ! నిన్ననేగా "మా యింటి లక్ష్మి" అంటో నేను వొళ్ళో గూచోబెట్టుకుంది. చూశారా అన్యాయం ?"

"ఎవర్ని" అన్నారు అమ్మలక్కలు.

"ఇంకెవర్ని ? ఎవరినంటే యెవరు పడతారు ? నేనే, అన్నిటికీ నేనే! విన్నారా ? చావబొయ్యే అరవై యేళ్ళవాణ్ణి! నేనట ఇంట్లో ఆడవాళ్ళని నిలవనీకుండా చేస్తున్నానట. నా కోడల్ని ! బావుంది నాయనా ! చెప్పినదాన్ని కాదు, నమ్మిన నిన్ను అనాలి!"

నరసింహారావుకు సందేహం తోచింది, ఆయన మాటలు వింటే తొందరపడ్డాడేమో ?

"ఏమైతేనేం! పోనీ, అది వొస్తేఏం?"

"ఏమిటి ? వ్యవహారానికి ఆడదాన్ని వెంటవేసుకు బయల్దేరతావా? మంచి వ్యవహారమే చేస్తావు ?"

"నేను సరిగా చేసుకొస్తే సరిగా ?"

"నీవు చేసుకొస్తావు? చార్జీలో? డబ్బు కోళ్ళు యేరుకు తింటు న్నా యా? నువ్వూ, నీ పెళ్ళామూ షికార్లు తిరగడానికి మూటలు దాచి పెట్టానా?"

"ఐతే నేనూ వెళ్ళను."

"వెళ్ళవూ? వెళ్ళక, తేరగా ముప్పొద్దులూ తిని, పెళ్ళాం దగ్గిర పడుకుందుగాని అంబోతులాగ?"

"ఏం! నీ సొమ్ము పెడుతున్నావా?"

"నా సొమ్ము గాక, ఎవరిసొమ్ము! నీ తాతసొమ్ము! ఏం దాచిపెట్టా వురా నా దగ్గిర?"

"నా భాగం నాకు పారెయ్యి."

"నీ భాగం? నీ భాగ మేమిటి? నువ్వు సంపాయించిందా? నా కష్టా ర్జితంలో నీకు భాగమేమిట్రా! ఏదో నీ తాతలందరూ నాకు ఆస్తి వారగ బెట్టినట్టు ధీమాకే చేస్తున్నావే?"

"ఏమీ లేదా!"

"ఒక్క దమ్మిడీ లేదు"

"నేను బతికేదెట్లా?"

"నే నెట్లా బతికానూ? సంపాయించుకో?"

"ఎట్లా సంపాయించుకోను?"

"నీ యిష్టం. నేను చెయవలసిందేమో చేశాను. ఇంకేం చెయ్యను? పైగా యింత చేస్తే ఇదీ కృతజ్ఞత. నిన్న వచ్చిన కుంకముండ మాటలు విని, నన్ను నానామాటలూ అంటున్నాడు."

తండ్రిచేసిన మేలుకి కృతజ్ఞత చూపాలని కోర్కెతప్ప, ఆ కొడుకుని పుట్టించినందుకు సంపాయించుకునే శక్తినివ్వడం తమ బాధ్యత అని గుర్తించరు పెద్దవారు రాసిన పురాణాలు నీతిశాస్త్రాలు కావడంచేత, అవి తండ్రులయెడల భక్తిలేని బాధ్యతల్ని మాత్రమే స్తోత్రాలు చేశాయి.

ప్రశ్నించిన కొడుకుల్నీ, ఎదిరించిన కొడుకుల్నీ, శపించారు. కనేదీ, ఏదో నలుగురితోపాటు వుపయోగమున్నా లేకపోయినా, చదువు చెప్పించేదీ, చిన్నప్పుడు ఎదిరిస్తే తన్నేదీ, పెద్దప్పు డెదిరిస్తే బొమ్మనేదీ. ఎక్కడికి పోతాడు, ఆ భార్యతో? వొంటరివాడైతే ఎక్కడన్నా తిరుగును.

"మరి యీ పెళ్ళి యెందుకు చేశావు."

"చెయ్యడమూ తప్పేవొచ్చిందీ? నీకింత భారమైతే విడిచెయ్యి."

అవును, ఎందుకు పెళ్ళి చెయ్యాలి? అనే యీ ప్రశ్న నరసింహా రావేగాదు, యీ దేశంలో లక్షలకొలది దురదృష్టవంతులైన యువకు లడుగుతున్నారు. అడుగుతోనే వున్నారు—వాళ్ళకన్న చిన్నవాళ్ళయిన పసి వాళ్ళు పెళ్ళి చేసికొంటోనే వున్నారు. కొంచెం యెదిగి తమ తెలివినీ, సాహసాన్నీ, ప్రయోజకత్వాన్నీ, సార్థకపరచుకోవాలని యెగరబోయి, కాళ్ళకు చుట్టుకున్న భార్య అనే యీ గొలుసు గట్టిగా లాగేప్పటికి, నేల మీదపడి రెక్కలు కొట్టుకుని, సొమ్మసిల్లి, ఎవరుచేశారు నాకీపెళ్ళి? అని ఆశ్చర్యంతో ఆలోచిస్తున్నారు. స్వార్థపరులై, తమ అవస్థని చిన్న వాళ్ళకి చాటి చెప్పరు, గొప్పపదవులకీ, పరదేశాలకీ, వున్నతాదర్శాలకూ, తగిన మేధాశక్తులతో, జన్మించిన యీ దౌర్భాగ్యులైన యువకులు.

పసుపుబట్టలూ, బాజాలు నాలుగునాళ్ళ గౌరవాలూ, పట్టంచు జరీ పంచలూ, తమముందు సిగ్గుపడి తల వొంచుకుని పేరు చెప్పడానికి గుంజుకునే చిలకనిచూసి మురుపేగాని, సమస్త ఆశయాల్నీ, ధైర్యాల్నీ బౌన్నత్యాల్నీ జీవితంలోని ఆనందాన్నీ సంపూర్ణంగా నాశనంచేసి, గానిగ యెద్దుగా, జట్కాగుర్రంగా, తమని మార్చగల బానిసత్వాన్ని అమ్ము తున్నారని, యావజ్జీవన బంధన సామర్థ్యంగల పంజరాన్ని తమచుట్టూ నిర్మిస్తున్నారని మరిచిపోతారు.

ఏంచెయ్యను? ఎట్లా సంపాయించను? అనే సమస్య వచ్చేప్పటికి గుడ్లు మిటకరించి చూస్తారు. పదహారేళ్ళు. ఎమికలు విరగగొట్టి చదువు మరలోవేసి నలిపి, ఆనందాన్ని ఆరోగ్యాన్ని ధ్వంసం చేసిన యీ వుపాధ్యాయులూ, యీ తలిదండ్రులూ, ఒక్కరూ జవాబు చెప్పరు. మీరిచ్చిన భార్యని యెట్లా పోషించను? అని అడిగితే ఒకరి నోరూ పెగలదు.

"కూలిచేసుకో" అంటారు సులభంగా, ఈజీకుర్చీలలో పడుకొని, తాంబూలాలు నములుతో.

కూలి! పదహారేళ్ళ కూలికీ, పనికీ, పాటుకీ, సాహసానికీ, తిరగ బాటుకీ, పనికిరాని అప్రయోజకుడిగా చితకకొట్టి, ఎందుకూ కొరగాని హిస్టరీలు, సైన్సులూ, లెక్కలూ వల్లెవేయించి, నేడు,

"కూలిపని చేసుకో" అనడం చాతనవును. ఈ పెద్దలనట! పూజించాలట!

ఇంక తనకేం అధికారముంది ఆ యింట్లో! రాత్రి భోజనందగ్గిర తనవాళ్ళ మొహాలు యెట్లాచూస్తాడు ఇదివరకంతా భార్యదగ్గిర కోశాడు! తనకి అవసరంలేదుగాని తనే ప్రయత్నంచేస్తే, తన విద్యావిశేషాలకే వుద్యోగాలైన సులభంగా పిలిచియిస్తారని. భార్యలకి లోకజ్ఞానం తక్కువ కావటంచేత యిట్లాంటి కోతలు భర్తలు చాలామంది కోసి గృహగౌరవం నిలబెట్టుకుంటారు. తమ భర్తలద్వారా నన్నాతను ఆత్మగౌరవం నిలుపుకోవాలని వాళ్ళమాటలు నమ్మడానికి భార్యలు సిద్ధంగావుంటారు. ఆ కోతలు తీసుకుపోయి తమ పొరుగు ఆడవాళ్ళవద్ద తమ ఆధిక్యం చూపుకుంటారు ఆ భార్యలు.

నిజంగానే తనకు ఆస్తిలో భాగంలేదా? లేక ఊరికే దడిపిస్తున్నాడా తండ్రి? కొడుకుని వదలి పరాయివాడికి యివ్వవచ్చునా ఆస్తి? అంత వికృతం వుంటుందా న్యాయచట్టంలో?

ప్లీడర్ని అడగాలి. తమ కుటుంబ వ్యవహారాలు చూసే హనుమంత రావుగారిని కలుసుకొని కనుక్కుంటే? సాయంత్రం వెళ్ళాడు.

"లేదు. నీకేమీ హక్కులేదు, కాని ఆ యోచన యెందుకు?"

"ఏమో ఆయనకి నామీద విరోధమైతే యెవరికన్నా యివ్వవచ్చు, అప్పుడు నేనేం చెయ్యాలి?

"ఏమీ? ఏమన్నా తగూలాడారా యేమిటి? ఈ తగూలకేంలే!"

"అట్లా కాదులెండి."

"చాలా చూశాను. బతికివున్నన్నాళ్ళూ మొహాలు మొహాలు చూసుకొని తండ్రీ కొడుకుల్నీ. హిందువు దయింతర్వాత చచ్చేప్పుడు కొడుక్కేయిచ్చి మరి చచ్చిపోతాడు."

"చివర కేమైనా, ప్రస్తుతం ఒక కాని యివ్వడుగద!"

మంచిపని చేస్తున్నాడు. నీవుసంపాయించుకోవాలిగాని, ఆయనమీద ఆధారపడడం అదేంపని?"

"ఎట్లా? వుద్యోగం దొరికితేనే కద"

"దానంతట అది దొరుకుతుందా? నువ్వు ప్రయత్నించాలిగానీ"

ప్రయత్నింతమనడం సులభమే. ఎట్లా? ఎక్కడ? ఉద్యోగం చెయ్యడం ఎట్లానో, ఏకొంతో నేర్పారుగాని, ఉద్యోగానికి ప్రయత్నించుకోడం యెట్లానో? కల్పించుకోడం చెప్పలేదు కాలేజీలలో. పైగా ఆశక్తి నాశనంచేశారు.

"ఎక్కడ?"

"అవును ఈ కాలంలో ఉద్యోగాలు దొరకడం కష్టమే? కానీ నీకు తొందరేం? అయ్య వుండగా!"

"వుండేం లాభం? దమ్మిడీ ఇయ్యడు. అల్లాంటి అనాధబతుకు బతకడంకన్న పాకీపని చేసుకోడం మంచిది."

"నిజంగానే మాట్లాడతావా ఆ మాటలు? దొరికితే ఆపనే చేస్తావా?"

"ఆ చాతనైతే."

"చాతనైంది, జీతం తక్కువనీ, ఘరానాకి తక్కువ అనీ అనుకోవుగదః సరేనా? నా దగ్గిర మూడో గుమస్తా పని ఖాళీగా వుంది. పదిహేను రూపాయలిస్తాను; పైన దొరుకుతుంది."

వెనక్కి తగ్గాడు. "ప్లీడరు గుమస్తా?"

"ఏం."

పౌరుషమొచ్చింది. తండ్రికి మంచి శాస్తి రెండుమూడు విధాల.

"ఎప్పణ్ణించి రాను?"

"అదీ ధైర్యమంటే. రేపొద్దున్న యేడింటికి సరేనా? మళ్ళా యోచించాలా?"

"అక్కర్లేదు."

తనకు ఆస్తిమీద హక్కులేదనే విచారమే మరిచిపోయినాడు. తండ్రి పరువు పోయిందని యేడుస్తాడేమో? తండ్రిమీద గౌరవంలేదుగాని ప్రేమవుంది. యేడవనీ, మరీ సంతోషం వేరే కాపరం పెట్టాలా? ఒక నెల జీతమన్నా రానీ.

అతని విద్యవలెనే, చంద్రుని నిర్మల కాంతి రోడ్డు దుమ్ముతోనూ, పక్కన మురుగుకాలవలలోనూ — యి కుతోంది. అడవిలో విచ్చవలసిన చామంతులూ, గులాబీలు, బూజుగుట్టలో, కుళ్ళునీళ్ళలో వూరి దిక్కులేనట్లు చందమామకేసి చూసి యేడుస్తున్నాయి. ఆతను అదేమీ చూడక తన కొత్తవుద్యోగపు కలలు కంటో యింటికి పోతున్నాడు;

మర్నాటినుంచి వుద్యోగం మొదలు. షోకుగా పంచలు కట్టుకుని 'ట్వీల్' షర్టు వేసుకుని సిగరెట్ నోట్లోపెట్టుకొని, కోర్టు మునసబుగారి కోసం తోవజేసే బిళ్ళజవానికి అడ్డంగా కదలక నుంచునేవాడు— ఒక్కవారంలో చెవులో కలంపెట్టి, తలకి అంగోస్త్రంచుట్టి, మోకాళ్ళ వరకు పంచకట్టి, పరుగెత్తే గుమాస్తాల్లో గుర్తించడం కష్టంగా తయారై

నాడు. ఒక్క క్రాపే మిగిలింది. దాన్ని తువ్వాలకింద దాచాడు. సగం మీసంకూడా పెంచాడు. అంతమార్పు అవసరం, కాని విత్ ఎ వెంజెంస్ with a vengeance చేస్తున్నాడు. అదంతా, సెల్ఫ్‌పిటీ self-pity తండ్రిమీద కోపం. అదిగాక యీ వేషంతో తాను నిరంతరమూ ఆ కోర్టు ఎట్మాస్ఫియర్ atmosphere లో మెలగడం సులభంగా తోచడం యిన్నీ సహాయం చేశాయి. దస్త్రాలు మోశాడు. చదువురాని పెద్ద గుమస్తాలకింద ఊడిగం చేశాడు. తనతో చదువుకున్నవాళ్ళు యిద్దరు ప్లీడర్లుగావున్నారు. వాళ్ళని ఎరగనట్లే చూశాడు. మొదటిరోజే రెండణాలు సంపాయించాడు. గాలరీమీద కూచుని లెక్చరర్లని యేడిపించినవాడికి, పార్టీలని యాచించడం కష్టమనిపించింది. రెండణాలకోసం — ఒక్క సిగరెట్ పెట్టెకి పారేసిన దాంట్లో సగంకోసం కాని వుద్యోగధర్మం ఆయాచన. రెండణాలకోసం గాదు. కాని తాను స్వంతంగా సంపాయించిన రెండణాలు, యెట్లా గంతులు వేసిందది జేబిలో. సిరామరకల వేళ్ళతో, ఆ బేడని తన భార్యచేతులో పెట్టాడు. గొప్ప గర్వంతో.

తండ్రి యేమీ అడగలేదు. భార్య కొత్త గోల యేమీ పెట్టలేదు. తొందరపడ్డానేమో అనుకున్నాడు. తండ్రే పొరుగూళ్ళుపోయి ఆ వ్యవహారాలు చేసుకున్నాడు. ఒకరోజు మధ్యాహ్నం పంకజాక్షితో ఆయన,

"ఏమే, నీ మొగుడు గొప్ప ఉద్యోగం సంపాయిచ్చాటగా?"

"అవునట."

"మరి వుద్యోగస్తుడయినా నీకు ఓ చీరెన్నా కొనిపెట్టలేదే ?"

"ఏమో! కాని, ఇంకా జీతం యేదీ?"

"ఇంకేం బనారసు చీరెలు కడతావన్నమాట. నగలుకూడా చేయిస్తాడా?"

"ఏమో! యెవరి అదృష్టం యెట్లావుందో?" అంది

అలిసి రాత్రి పదింటికి వొచ్చాడు నరసింహారావు. భోజనంముందు పంకజాక్షి కనపళ్ళేదు. తొరగా రెండుమెతుకులు నోట్లోవేసుకుని గది

దగ్గిరికి వెడితే, లోపల గడియ వేసివుంది. తండ్రి సావిట్లో కూచుని యేదో పొంకపెట్టుకుని అందర్నీ తిడుతున్నాడు.

ఎంత తలుపుకొట్టినా ఆమె తలుపుతియ్యదు. చివరికి లోపల్నించి, పదిసార్లు ఎవరని అడిగి, రూఢిచేసుకుని, తలుపు ఒక్కరవ్వ తెరచి, పరీక్షించి, లోపలికి రానిచ్చి, గడియ వేసుకుంది.

"ఏమిటి సంగతి?"

"ఏముంది? ముందు వేరే యిల్లు మాట్లాడి నన్ను యీ క్షోభనుంచి తప్పిస్తారా లేదా? అది చెప్పండి."

"సరేలే ముందు...."

"ఏముంది? పూజ్యులైన మీ తండ్రిగారు నేను యిందాక స్నానం చేసి బట్టచుట్టుకొని వాస్తోంటే, చీకట్లో యెక్కడ పొంచివున్నాడో పిల్లి లాగు, నామీద దూకి పట్టుకున్నాడు. కేకలేశాను 'వూరుకో వూరుకో, నేనే. నేనే.' అన్నాడు పైగా. నోటికొచ్చినట్లు తిట్టాను. చప్పున వొదిలి యేమి యెరగనట్లు పోయినాడు. కానీ, యేంలాభం. ఈ లోపలే ఆ రెండు నిమిషాల్లోనే తన దత్తినంతా తీర్చుకున్నాడు. ఏమంటారు."

"ఏం చేశాడు?"

"నాకు తెలీదు. ధైర్యముంటే ఆయన్నే అడగండి "

నరసింహారావు ఆలోచించాడు. వెళ్ళితగాదాపడితే యేమీ యెరగనంటాడు. ఇంకా పోట్లాడితే, ఆరాత్రే యింటోంచి నడవమంటాడు. యేం లాభం?

"యేమిటి ఆలోచిస్తున్నారు?"

"యేం చేశాడు?"

"ఎంతసేపటికీ, యేంచేశాడు అనే గోలేగాని, అది మానిపించే ఆలోచనలేదు. పదండి ముందు, ఇంకా శృతి మించకముందే. ఈ యింటోంచి బయట పడదాము."

"సరేలే, యేమిటి ? చీకట్లో వొస్తున్నావూ ? అప్పుడు........"

"నేనొక్కమాట మాటాడను. మీరు యిల్లు మాట్లాడిందాకా."

"ఇల్లు ఎట్లానూ కుదురుస్తాను. ...........ఆ..........చీకట్లో... "

"నాకు తెలుసులెండి ఈ శ్రీరాముని యెత్తులు."

"శ్రీ రాముడి యెత్తులేమిటి?"

"ఏముంది? అన్ని సంగతులూ మెల్లిగా ఆడదాని దగ్గరనుండి బెల్లించి కనుక్కునేది, పరాయివాడు తాకాడా అని ఆగ్రహించి పెళ్ళాన్ని వొదిలేసేదీ అంతేగా! సుఖంగా బతుకుతున్న సీతని, తండ్రిమాటలువిని అరణ్యాలకి లాక్కెళ్ళి, రాక్షసికి వప్పజెప్పిన సంగతి యెవరికీ పట్టదు. రావణుడు సీతనేంచేశాడనే అందరి ప్రశ్నా? పైగా లేడిని పట్టిమ్మన్నది, చపలచిత్తురాలు, ఎంతైనా ఆడది అని సీతమీదనే నెపం. ఆ రాముడు లేకుండా వొంటరిగా ఆ యింట్లో వుందా—మీరు వుండగానే నాగతీ యిట్లా వుందే."

"నోరుముయ్యి"

"అంతే, చివరికి అనేమాట అదే."

ఒకయింట్లో భాగం రెండున్నర రూపాయలకి కుదిర్చి, ఎవర్తో చెప్పకుండా భార్యని తీసికెళ్ళి కాపరం పెట్టాడు. తల్లి గోల పెట్టిందిగాని తండ్రి ఆ ప్రస్తావనే యెత్తలేదు.

పదిరోజులయింది. డబ్బులేదు. ప్లీడరు అడ్వాన్సు యియ్యనన్నాడు తోటిగుమాస్తాలు అతన్ని అప్పడుగుతున్నారు. నరసింహారావు పార్టీల్ని పీడించడం అధికం చేశాడు.

జీతం వొచ్చింది. పూర్తిగా బాకీలు తీర్చడానికికూడా చాలలేదు. తండ్రి యథావిధిగా, మామూలు ప్రకారం ప్రేమగా మాట్లాడుతున్నాడు.

కాని అతని సంసారం సంగతిగాని, డబ్బుసంగతిగానీ యెత్తడు. తల్లి ఏడుస్తుందిగాని ఒక్క దమ్మిడీ యివ్వదు. కాస్త పచ్చడి పెట్టదు. ఏదో ఆ యింటివాళ్ళు కూడపలుక్కుని తనని యేడిపిస్తున్నట్లుంది.

నాలుగు నెలలు గడిచాయి. నరసింహారావు ఆర్థిక స్థితి క్రమేణా హీన స్థితికి దిగుతోంది. ఆదాయం వృద్ధి అవుతోంది చాలా 'స్లోగా'— అప్పులు అతి త్వరితంగా పెరుగుతున్నాయి. అతని రాబడిలో సరిపుచ్చుకొని బతికే కుటుంబాలు అనేకమున్నాయి. కాని అతనికి చేతకాదు. వూరికే బీదవారి స్థితి అని 'జాలి' పడతారుగాని, బీదతనం అలవాటైనవారికి అంత కష్టంకాదు, బీదగా బతకడం. చిన్నతనంలో గొప్పగా, అన్ని అనుభవాలతోనూ బతికి, తరవాత యౌవనంలోగాని, వృద్ధాప్యంలోగాని, కష్టదశలో పడ్డవారి యాతన యే దరిద్రులూ పడరు. కర్చు తగ్గించుకోడం, వారి తరంకాదు.

నరసింహారావు పెరుగుఆమెకీ, కూరమనిషికీకూడ అనంతమైన బాకీలు. అందరికీ లోకువైనాడు. పాపం. స్వతంత్రం అభిలషించి, కష్టార్జితంవల్లనే బతకాలని చూశాడుగాని, విసుకెత్తి, అధైర్యపడి, పోనీ మళ్ళా తండ్రితో సంధికివెళ్ళి, యీ వేరుకాపరం యెత్తెయ్యాలని ఆలోచించాడు కాని పంకజాక్షి నన్నేమి చేస్తావంది, తన పుట్టింటికి వెడతానని బెదిరించింది. పుట్టింట్లో ఆమెకి చోటు లేదని అందరికీ తెలుసు; ఆమెకీ తెలుసు. కాని మామ యింటికన్న అదే నయమంది.

ఆమె బట్టలన్నీ చీలికలైనాయి. ఇదివరకు నరసింహారావు తమ కొట్టుమీదికి వొస్తేచాలు కొట్టు అతనికి మూటకట్టి యివ్వాలని కంపీట్ చేసే బట్టలవర్తకులు, యిప్పుడతన్ని ఆ వైపులకు రానీటంలేదు, తండ్రితో తగాదా వొచ్చిందని తెలుసుకుని. పంకజాక్షి దాచుకున్న పట్టుచీరెలు, ధరించడం ప్రారంభించింది. వాటిని చూసి, నరసింహారావుకి ఐశ్వర్యం పుట్టిందని అప్పులవాళ్ళు అనుకున్నారుగాని ఆ పట్టుచీరెలు, దీపం ఆరేముందు, చూపే పెద్ద వెలుగని గ్రహించారు, కొన్నాళ్ళల్లో.

పంకజాక్షికి భర్తమీద నిర్లక్ష్యం రోజురోజూ యెక్కువవుతోంది. అతను గొప్పగా సంపాదించేవాడు కాడనే సంగతి తెలుస్తోంది ఆమెకి. ఆమెకూడా గొప్పయింటిబిడ్డ. ఈ బీదరికం, నీచత్వం భరించలేకుండా వుంది. ఆడదానికి తన యింటికె యిరవైగజాలు సర్కిల్లో వున్నదే ప్రపంచం, చుట్టూవున్న ప్రజలే లోకం. కనక వాళ్ళు నిర్లక్ష్యంచేస్తే భరించలేదు. ఇదంతా భర్తమీది కోపంగా మారుతోంది ఆమె మనసులో. తన ప్రోత్సాహంచేత తలిదండ్రుల కొంప విడచినసంగతీ, గొప్ప విద్య గలవాడు పగలంతా గుమస్తాచాకిరీ చేస్తున్న సంగతీ మరిచింది అప్రయోజకుడనేదే మిగిలింది, ఆమె మనస్సులో.

ఆమె తాసిల్దారుకూతురు. గొప్ప ఆస్తికలవాడనీ, విద్యాధికుడనీ తనని యిస్తే, చివరికి ప్లీడరు గుమస్తాగా తయారైనాడు. పుట్టినింట్లో యిట్లాంటివాళ్ళు, వంటకికూడా పనికివొచ్చేవారుకారు. తనకి వొచ్చిన గొప్ప సంబంధాన్ని తలచుకుంటుంది; భర్తమీద మండిపడుతుంది.

భార్య తృణీకారాన్ని నోటీస్‌కూడా చెయ్యలేదు. అతనిజన్మే తృణీకారాన్ని భరించే ప్రెయివింగుగావుంది. ఆఫీసులో, పనిలో, లోకువా, అడకువా, నీచత్వమూ, చీవాట్లూ, యాచనా, లంచాలూ, అబద్ధాలూ, అవమానాలూ, బాకీలమనుషుల తిట్లూ కూరలదాన్నిచూసినా భయమూ; కనక భార్య నిర్లక్ష్యంకూడా అలవాటయిపోయింది అతనికి. రేపు ఎట్లా గడుస్తుంది అనే ఆలోచనతప్ప యింకేమీలేదు అతనికి. అదృష్టదేవత ఎంత దగ్గిరగా వేగంతో వొస్తోందీ ఎట్లా తెలుసు అతనికీ? జాతకమన్నా చూపించుకోలేదు. చివరికి, వాళ్ళు చెప్పినా నమ్మగలిగే వాడుకాడు.

ఆనాటి మధ్యాహ్నం విచారంగా పడుకునివుంది.

ఇదివరకే ఆలోచించింది చాలాసార్లు. పుట్టింటికి పోదామా, ఇంకెక్కడికన్నా పోదామా, అని. ఎక్కడో ఆడవాళ్ళకి వుచితంగా

భోజనంపెట్టి చదువు చెప్తతారట. చదువుకుంటే వుద్యోగాలిస్తారట! అని కూడా తెలుసుకుంది. ఈనాడు మళ్ళా అదే ఆలోచన వొచ్చింది.

తనగతి తలుచుకొని యేడ్చింది. ఎప్పుడూ జన్మంతా యింతేనా! అంటుతోమడం, వండడం, బట్టలు వుతకడం—ఇంతేనా జీవితమంటే?

అని తలచుకుని, 'సెల్ఫ్ పిటీ'తో యేడుస్తోంది.

ఆ కిందటి రాత్రే భర్తతో తగాదా పెట్టింది. చీరలకోసం.

పార్టీలనించి చాలాడబ్బు అక్రమంగా గుంజుతున్నాడని ఆ సాయంత్రమే ఆతనికి ప్లీడరునించి చీవాట్లు తిగిలాయి. అందువల్ల అతను మండిపడ్డాడు. అతని వరుంబడి యెంతో ఖర్చెంతో పంకజాక్షికి తెలీదు. ఆడదానికి తెలియ చెప్పడం పురుషుడి దర్జాకి లోపం. అట్లాంటి అలవాటే లేదు వాళ్ళకుటుంబంలో. తండ్రిమీద ఎంతద్వేషమున్నా తండ్రి అలవాట్లని అనుకరించడం తప్పించుకోలేడుగదా! అతనిలోవున్న తండ్రిరక్తాన్ని యెక్కడికి తరుముతాడు! అతను పడే యిబ్బందులు ఆమెకి తెలీవు. అతను డబ్బు దాచుకుంటాడనీ, ఎవరికో ఆడదానికి యిస్తున్నాడనీ పరిపరివిధాల అనుమానాలు పడుతోంది. ఇట్లా అనుమానాలు పడి కోపం పెంచుకుంటోందని అతనికి తెలీదు.

ఆనాటి మధ్యాహ్నమే అతను పెద్ద గుమాస్తానించి చాలా ఆశ్రయించి అప్పు తీసుకుని రహస్యంగా 'డెస్కు'లో పెట్టుకుని చదివిన కొకోకంలో సంగతులు కొన్ని ఆ రాత్రి 'ప్రాక్టీస్' చెయ్యాలనే తలపుతో వొచ్చి వుండడంవల్ల, ఆమెతిట్లు అతన్ని మరింత రెచ్చకొట్టాయి. మాటలు పెరిగాయి ఆ రాత్రి. రెండుతన్నులుతన్ని లేచిపోయినాడు. రాత్రంతా కాలేజీ అరుగులమీది నిద్రపోయినాడు. ఆమె రాత్రాంతా తనకి, తాసిల్దారు కూతురికి, ప్లీడరు గుమస్తావల్లకలిగిన యీ అవమానానికి కోపం రగుల్చుకుంటోంది.

ప్రొద్దున్న విధిలేక యిల్లు చేరుకున్నాడు గాని భార్యాభర్తలకి మాటలులేవు. ఈనాడే తన్నులు తన్నే భర్త యింక ముందెంత క్రూరుడు కాబోతున్నాడో! అని 'టైమ్ అండ్ వర్క్' ప్రకారం లెఖ్ఖవేసి చూసి, చాలా ఖిన్నురాలయింది. భర్త ఆఫీసుకు వెళ్ళగానే ఒక అరగంట పొరుగువాళ్ళతో తనసోది చెప్పుకుంది. తరవాత అత్తవారింటికి పోయి అత్తగారితో తన అవస్త, మామగారికి వినపడేట్లు మొత్తుకుంది. మామతో సరసాలు యిష్టం లేకపోయినా, ఆయనికి తనమీద యిష్టం కావడంవల్ల, ఆయన నించి సానుభూతి కలుగుతుందనే భావం ఉపశమనం కలిగించింది. ఇతరుల సహాయం చెయ్యలేకపోయినా, ఇతరుల నించి సానుభూతిని పొందాలనే ఆశ, ప్రజల్ని తను పక్షానికి తిప్పుకోవాలనే కోర్కె సహజం.

ఆనాటి మధ్యాహ్నం తీవ్రంగా ఆలోచిస్తోంది, ఏమిగతి? ఎట్లా పోదామా? అని. ఇంతలో ఎవరో తలుపు కొట్టారు తలుపు తీసేప్పటికి మూరెడు చుట్టతో మామగారు ప్రత్యక్షమైనాడు. అతన్ని చూడ్డంతోటే, ఆమె వాణికి, ఏమనడానికీ తోచక, కూచోమంది, ఆయన ఒక మాట మాట్లాడకుండా చంకలో మూటతీసి, విప్పాడు. కళ్ళు ధగధగ మన్నాయి. ఆరుచీరెలు. అంతకుముందే అత్తవారింటికి నడుస్తోవుండగా రోడ్డుమీద ప్రజలు తనవంక చూస్తోండడం గమనించి, కిందికి చూసుకుని, తొడమీద చీరెకి పెద్ద చిరుగును గమనించి, ఇంకా తాను ఎందుకు బతికివున్నానా అని చింతించింది.

ఆరుచీరెలు! కొత్తవి! పట్టంచు రెవికెగుడ్డలు!

"ఏమిటవి?"

"నీకోసం."

చప్పున రెండుచేతులతో తీసికొని గట్టిగా రొమ్ముకి వొత్తుకుంది ఆ చీరెల్ని. కళ్ళంబడి బొటబొట నీళ్ళు కారాయి. ఆ బట్టల కొత్తకంపు ఆమెకి గొప్ప పుష్పపరిమళంలాగ తోచింది.

పైగా రెండునోట్లు చేతులో పెట్టాడు.

"మళ్ళీ వొస్తాను' అని లేచాడు ఆ దయామయుడు.

మాట్లాడకలేక నుంచుంది. సాంబశివుడు ప్రత్యక్షమైనప్పుడు కూడా కాటిలోని చంద్రమతి అంత ఆశ్చర్యపడి వుండదు.

మళ్ళా ఆలోచించాడు. ఒక్కనిమిషపు 'ఛాన్స్' ఆలోచించినమీద జీవితంలో ఎన్ని ఆధారపడతాయి.

"కట్టుకో చూస్తాను."

ఒక్కగంతున వంటింట్లోకి వెళ్ళింది. ఆలోచిస్తూ, సందేహిస్తూ నిలుచున్నాడు ముసలాయన.

తలుపు గడియ వేశాడు.

ఆమె తన పేలికలు విప్పేసి, పొయ్యికి మూతపెట్టిన తప్పాలాలకీ, గోడమీదవున్న మసికీ తగలకుండా చీరెని యెత్తిపట్టుకుని కట్టుకోబో తోంది చీకట్లో ఆమె కళ్ళు కొత్త రంగుల్ని చూడ ప్రయత్నిస్తున్నాయి.

వెంటనే వచ్చి మామ పట్టుకున్నాడు. అరవడానికి శక్తిలేదు. దృఢత్వం పోయింది. ఎవరు వచ్చినా ఏమి చెప్పుకుంటుంది? తనకేం గౌరవంవుంది చుట్టుపక్కల? అరవడానికి కారణమూ కనిపించదు.

రాత్రి భర్త వచ్చేప్పటికి ఆమె మహాలక్ష్మిలాగ కొత్తచీరె ధరించి, కళకలలాడుతూ ఎదురొచ్చి, కాచివుంచిన వేన్నీళ్ళు స్నానానికిచ్చి, కొత్త కూరలతో, చక్కని భోజనంపెట్టి ఆదరించినది.

"ఎక్కడివన్నీ!"

అబద్ధం చెప్పడం ఆమె యింటా వంటా లేదు.

"పాపం, మీ నాయనగారు యీ చీరెలూ, డబ్బూ యిచ్చివెళ్ళారు."

"మా నాన్నా!"

ఆమె మొహంవంక తేరిపార చూశాడు. ఏమీ చలనంలేదు.

"ఎంతైనా తండ్రికడుపండీ" అంది.

ఆ రాత్రి నరసింహారావు కొక్కొకంలోని కొత్త పోకడలు రుచి చూశాడు, చితికిపొయ్యే కొడుకు సంసారాన్ని యిలవేలుపై నిలబెట్టాడు తండ్రి!

★